క్లుప్తంగా

వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేత



బాలవికాస భారతి ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు అందించిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వృద్ధ మహిళలకు బాలవికాస్ భారతి ఆధ్వర్యంలో దుస్తులు, పండ్లు అందజేసారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పి.రత్నాకర్ రావు మాట్లాడుతూ తరతరాలుగా మన పెద్దలు, పూర్వీకులు వైభవంగా సంక్రాంతి పండుగను నిర్వహిస్తూ గొప్ప సంప్రదాయాన్ని భవిష్యత్తు తరాలకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జి.సత్యనారాయణ, కమ్మిలి నాగేంద్రరావు, లావణ్య, ముత్యం, కార్తీక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభం



సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఏలూరు తహసీల్దార్ పి.సోమశేఖర్

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి పండుగ వంటి సందర్భంలో యువత చెడు వ్యసనాల వైపు మరలకుండా తెలుగు సంస్కృతి కాపాడే విధంగా అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఏలూరు తహసీల్దార్ పి.సోమశేఖర్ పిలుపు ఇచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏలూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ రాజా అధ్యక్షత వహించారు. తహసీల్దార్ సోమశేఖర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తదితరులు మాట్లాడారు. సీఐటీయూ నాయకులు ఆర్బిటర్ డి.లక్ష్మణరావు, కృష్ణవేణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జూద క్రీడల నిషేధం

పెదపాడు: జూద క్రీడలు నిషేధమని పండుగ సంప్రదాయం పేరుతో కోడిపందేలు, పేకాటలు, గుండాట వంటివి నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. పెదపాడులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు గ్రామాల్లో విస్తృత దాడులు చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.



హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళ



సంక్రాంతి వేళ గంగిరెద్దుల వారి హడావుడి



పోటీలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న యువతులు



పిట్టల దొర

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- పట్టణాల్లో, పల్లెల్లో పండుగ సందడి
- ఆకట్టుకుంటున్న రంగవల్లులు

ఏలూరు (టూటౌన్): తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ. ధనుర్మాసం ప్రారంభం కాగానే సంక్రాంతి నెల ఆరంభమవుతుంది. ఈ నెలంతా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి హరిదాసులు కీర్తనలు ఆలపించడం సంప్రదాయానికి అద్దం పడుతోంది. ఏలూరు నగరం, పరిసర గ్రామాల్లో భోగి మంటలకు ఏర్పాట్లు, గంగిరెద్దుల విన్యాసాలు, నూతన వస్త్రాల కొనుగోలు, ఇళ్లల్లో తినుబండారాల తయారీ, వీధుల్లో బాలబాలికలు గాలిపటాల ఎగుర వేత, ఇళ్ల ముంగిట యువతులు పోటీపడుతూ తీర్చి దిద్దే రంగురంగుల రంగవల్లులు, పిట్టల దొరల మాటల గారడీ ఎక్కడ చూసినా ఒకటే సందడి నెలకొంది. సంక్రాంతి వేళ వేసే ముగ్గులు తమకు ప్రత్యేక తీపి గుర్తుగా ఉంటున్నాయని మహిళలు చెబుతున్నారు.

ముగ్గుల పోటీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరం వరకూ కొనసాగుతున్నాయంటే దానిలో కీలకపాత్ర పోషించేది మహిళలే అని వ్యాపారవేత్త నారా శేషు అన్నారు. శనివారం స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ధర్మభేరి ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

వైభవంగా లక్ష తులసి పూజ



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న నాగమణి బుద్ధదేవ్ శిష్య బృందం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి లక్ష తులసి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం ఘనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సాయంత్రం సంగీత, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి శ్రీ హనుమద్ వైభవం అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శ్రీ నీరజ కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నాగమణి బుద్ధదేవ్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అబ్బురపరిచాయి. ఆలయ అర్చకులు కోసూరి సత్యనారాయణాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



స్వామి వారికి లక్ష తులసి పూజ చేస్తున్న భక్తులు

యాదవులకు గుర్తింపు, ప్రాధాన్యత

ఏలూరు ఎంపీ స్థానాన్ని యాదవులకు కేటాయించడంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత యాదవ సంఘం జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్) : గత పాలకులకు భిన్నంగా యాదవ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యతనిచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని యాదవ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేసారు. స్థానిక ఏటిగట్టులోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో యాదవ సంఘ ప్రముఖులు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీల్లో వీరిలో 17 శాతం యాదవులే ఉన్నారని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు అన్నారు. గతంలో యాదవులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, వీరిలో యాదవులకు తగిన గుర్తింపు లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాల కృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి మాట్లాడుతూ గతంలో యాదవులకు రాజ్యసభ సీటు కేటాయించిన సీఎం జగన్ తాజాగా ఏలూరు పార్లమెంటు స్థానానికి యాదవ నాయకుడు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలియజేసారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకుని సునీల్ కుమార్ యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

ఏలూరు ఎంపీ స్థానంలో విజయం తథ్యం

రాష్ట్రంలో యాదవులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఏలూరు ఎంపీ సీటును అత్యధిక మెజర్టీతో గెలిపించి కానుకగా అందిస్తామని యాదవ సంఘం నాయకులు చెప్పారు. యాదవులకు ఇంతటి ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్సార్ సీపీ గెలుపు కోసం వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని యాదవులంతా కలిసి కట్టుగా పనిచేస్తామని స్పష్టం చేసారు. నగర అధ్యక్షుడు బొట్టా అజయ్ కుమార్, జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, నాయకులు ఆకుల గంగాధరరావు, చిట్టిబోయిన పాపారావు, కొట్టి నాగభూషణం, మల్లిపూడి రాజు, కింజింగి నాగరాజు, పెద్దిబోయిన హరినాథ్, కన్నెబోయిన సుబ్బారావు, కుమార్ నాయుడు, ఆలమండ రామారావు, చిరంజీవి, బాబూరావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత, సాహిత్య, నృత్య ప్రదర్శనలు



పోటీల్లో విజేతలకు బహుమతులు అందించిన అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన సంగీత, సాహిత్య, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. శనివారం ఉదయం విశాఖపట్టణానికి చెందిన చిన్నారి బీ.శ్రీ లాస్య ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు అలరించాయి. ఈ కార్యక్రమములో తెలుగు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ నగరంలో సాహిత్య మండలి సాహిత్య, కళా రంగాలను ప్రోత్సహించడంలో ముందుంటోందని ప్రశంసించారు. సాహిత్య మండలి వేదికపై ఎంతో మంది తమ కళా, సాహిత్య నైపుణ్యాలను ప్రదర్శించి దేశ, విదేశాల్లో లబ్ద ప్రతిష్టులయ్యారన్నారు. ఈ వేదికపై అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావించేవారు ఇప్పటికీ ఉన్నారన్నారు. భావితరాలను సైతం కళా, సాహిత్య రంగాల్లో ప్రోత్సహించే దిశగా సాహిత్య మండలి సంప్రదాయ పండుగలను నిర్వహించడం, కళాప్రదర్శనలకు వేదికగా నిలవడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో హేలాపురి కళాకారుల సంఘ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, సీనియర్ న్యాయవాది కానాల రామకృష్ణారావు, నంది అవార్డుల గ్రహీత ఎండీ ఖాజావలి, తమ్మెర కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు. సభకు పి సత్యవాణి అధ్యక్షత వహించగా సాహిత్య మండలి సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో బాగంగా స్వామి వివేకానంద జయంతి సందర్భముగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

జగనన్న సురక్షలో కళ్లజోళ్లు అందజేత

ఉంగుటూరు: ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో కళ్ల పరీక్షించుకున్న వారికి కళ్లజోళ్లు శనివారం నారాయణపురంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, ఉపసర్పంచి మరడ సాంబశివరావు, ఆర్‌బీకే చైర్మన్ మతుకుమిల్లి శ్రీధర్, పంచాయతీ మెంబరు లోక్ వినోద్ వారాచారి, నాయకులు గోలి రామారావు, తాడిగడప వెంకటేశ్వరరావు, డాక్టరు సంధ్యారాణి, రాధారాణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	52
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	58
బెండకాయలు	40	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	40-48	కంద	60
కాకర కాయలు	50	బీట్‌రూట్	34
బీరకాయలు	40	కీర దోస	34
బీరకాయలు (పందిరి)	56	ఫ్రెంచ్‌బీన్స్	64
క్యాబేజీ	20	అల్లం	128
క్యారెట్	34-56	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25-30	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	08
దోసకాయలు	34-52	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	--

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్ఈఎల్	22.15	4822	18
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	రద్దు

పేద విద్యార్థికి సైకిల్ వితరణ

పెదపాడు: పేద విద్యార్థి సింగిరెడ్డి బాలుకు జెడ్పీచైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులు సైకిల్‌ను వితరణ చేసారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి బాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వీరాభిమాని. బాలుకు సైకిల్ లేదని తెలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు నూతన సైకిల్‌ను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పువ్వుల ఆంజనేయులు, ఏసురాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత మృతి

పెదవేగి : వరకట్న వేధింపులు తాళలేక ఇద్దరు తోటి కోడళ్లు కృష్ణ కెనాల్‌లో దూకేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన పాలపాటి సాయిశివ భార్య స్వాతి (33), పాలపాటి శ్రీనివాస్ భార్య రూపాదేవి (36) ఇద్దరూ తోటి కోడళ్లు. అత్తమామలైన కామరాజు, తిరుపతమ్మ, వారి కుమారులు శ్రీనివాస్, సాయిశివ అదనపు కట్నం కోసం వేధించడంతో ఈనెల 12న ఇంట్లో నుంచి వారిద్దరూ బయటకు వెళ్లిపోయారు. దీనిపై కేసు నమోదు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులకు శనివారం సాయంత్రం విజయవాడ కృష్ణ కెనాల్‌లో ఒక మహిళ మృతదేహం లభ్యమైందని, ఆమె స్వాతిగా పోలీసులు గుర్తించారు. రూపాదేవి గల్లంతైనట్లు పోలీసులు చెపుతున్నారు. స్వాతికి, ఇద్దరు, రూపాదేవికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదపాడు: వసంతవాడ, వెంకటాపురం, అప్పనవీడులోని పేకాట స్థావరాలపై దాడి చేసి 27 మందిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వసంతవాడలో పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,460, వీరమ్మకుంట శివారు వెంకటాపురంలో పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,140, అప్పనవీడులో 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,460 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. మొత్తం 27మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

కొల్లేరు ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం



గుడివాకలంక వద్ద కొల్లేరు రిసార్ట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: ప్రభుత్వ కృషితో కొల్లేరు ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక వద్ద కొల్లేరు రిసార్ట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరుకు పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి, పక్షుల విడిది కేంద్రం అభివృద్ధి చేసిందన్నారు. ఇదే క్రమంలో పర్యాటలకు విడిది కోసం ప్రభుత్వం నిర్మించిన రిసార్ట్స్ పునఃప్రారంభమయ్యిందన్నారు. పండుగ వేళ అనేక ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటలకు కొల్లేరు గ్రామాల ప్రజలను సైతం సాదరంగా ఆహ్వానం పలుకుతున్నారని వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంచెం మైబాబు, బొద్దాని శ్రీనివాస్‌తో పాటు జయమంగళ రామా రావు, ముంగర తిమోతీ, మండల కొండలరావు, బలే బలరామయ్య, రుక్మనంద్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయం

నిడమర్రు: పల్లెల అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. శనివారం బువ్వనపల్లిలో దాతల రూ.37 లక్షల సహకారంతో అభివృద్ధి చేసిన గ్రామ శ్మశాన వాటిక ప్రారంభోత్సవంలో పాల్గొని ఆమె మాట్లాడారు. దాతల సహకారంతో అభివృద్ధి చేసిన శ్మశాన వాటిక పార్కును తలపిస్తోందన్నారు. అంత్యక్రియల నిర్వహణకు ఆధునిక వసతుల కల్పించడంపై ఎమ్మెల్యే వాసుబాబును, సహకరించిన దాతలను ఆమె అభినందించారు. మానవత సంస్థ సభ్యులు సమకూర్చిన రూ.65 వేల విలువైన ఫ్రీజర్‌ను గ్రామ పంచాయతీకి అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, నిడమర్రు, గణపవరం వైఎస్సార్ సీపీ మండల బాధ్యులు పుప్పాల కన్నబాబాబు, చినబాబు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్ వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, సాగిరాజు జానకి రామరాజు ఉన్నారు.

బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు హర్షణీయం



రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంతోష్ కుమార్ తదితరులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని వివిధ జిల్లాల పర్యటనలో భాగంగా ఏలూరు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రెవెన్యూ అతిథి గృహంలో ఆయన్ను పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.400 కోట్లకు పైగా నిధులు వెచ్చించి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి ఈ నెల 19న ఘనంగా ప్రారంభించేందుకు సిద్ధమవడంపై హర్షం వ్యక్తం చేసారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి ఆద్యుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. విక్టర్ ప్రసాద్‌ను కలిసిన వారిలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పొలిమేర హరికృష్ణ, పాకా ప్రభాకర్, కనికెళ్ళ మురళీ కృష్ణ, మేతర అజయ్ బాబు, జిజ్జువరపు రవిప్రకాష్, మత్తే బాబీ, రోజారాణి, కె.రత్నకుమారి ఉన్నారు.